ప్రతి వ్యాపారి తప్పనిసరిగా ట్రేడ్ లైసెన్స్ పొందాలి


ఉమా ప్రకాష్

అబిడ్స్: ప్రతి వ్యాపారి తప్పనిసరిగా ట్రేడ్ లైసెన్స్ పొందాలని, ఇప్పటికే ట్రేడ్ లైసెన్స్ కలిగి ఉన్నవారు తమ లైసెన్స్‌లను రెన్యూవల్ చేసుకోవాలని జీహెచ్‌ఎంసీ 14వ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ ఉమా ప్రకాష్ తెలిపారు. తన కార్యాలయంలో ఆమె విలేకర్లతో మాట్లాడుతూ..పీటీఐఎన్‌లతో లింక్ అయిన 38 వేల పైచిలుకు వ్యాపారులు ఉండగా అందులో 20 వేల మంది వ్యాపారులు మాత్రమే ట్రేడ్ లైసెన్స్‌లు పొందారన్నారు. మిగతా వారు కూడా తమ ట్రేడ్ లైసెన్స్‌ల రెన్యూవల్ చేసుకోవాలని, లేని పక్షంలో కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఇప్పటి వరకు ట్రేడ్ లైసెన్స్ పొందని వారు మీసేవా ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు.

సన్మానం


ఇన్‌స్పెక్టర్‌ను సన్మానిస్తున్న మధిర సత్యనారాయణ తదితరులు

జియాగూడ: శాంతియుత వాతావరణంలో బోనాల వేడుకలు నిర్వహించడం వెనుక ప్రజల సహకారం ఎంతో ఉందని కుల్సుంపురా ఇన్‌స్పెక్టర్ సునిల్ అన్నారు. శనివారం జియాగూడ ఇమాంపురా నవ భారత సంఘం అధ్యక్షుడు మధిర సత్యనారాయణ ఆధ్వర్యంలో సంఘం సభ్యులతో కలిసి ఇన్‌స్పెక్టర్ సునిల్‌ను సన్మానించారు. ఈ కార్యక్రమంలో సంఘం సలహాదారులు ఆర్.బాలకిషన్, డి.లక్ష్మీనారాయణ, కోశాధికారి ఎం.మహేష్‌బాబు పాల్గొన్నారు.

సత్కారం



విజయ్ పోతరాజును సత్కరిస్తున్న నాయకులు

చాంద్రాయణగుట్ట: పాతబస్తీకి చెందిన విజయ్ పోతరాజుకు కాంగ్రెస్ ఓబీసీ సెల్ గ్రేటర్ ఉపాధ్యక్షుడు కాశమోని శ్యామ్‌రావు ముదిరాజ్ ఆధ్వర్యంలో శనివారం ఘనంగా సన్మానించారు. అమ్మవారి రక్షణగా పోతరాజు వేషధారణలో అలరించే ఆయన పుట్టిన రోజు సైతం ఉండడంతో పూలబొకే అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఆలయాలకు చెందిన ప్రతినిధులు ఆడాల శివకుమార్, వర్కల సత్యనారాయణ, శ్రీనివాసారావు, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

డాక్టర్ అఫ్సర్‌కు సినారె సాహితీ పురస్కారం ప్రదానం


అఫ్సర్‌కు సినారె సాహితీ పురస్కారాన్ని ప్రదానం చేస్తున్న సినీ డైరెక్టర్ నర్సింగ్‌రావు

సుల్తాన్‌బజార్: కవిత్వమే జీవన సర్వస్వంగా గడిపిన అరుదైన మహాకవి సినారె అని వక్తలు కొనియాడారు. తెలంగాణ సారస్వత పరిషత్ ఆధ్వర్యంలో శనివారం సాయంత్రం బొగ్గులకుంటలోని సారస్వత పరిషత్ దేవులపల్లి రామానుజరావు కళామందిరంలో సి.నారాయణరెడ్డి జయంత్యుత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ అఫ్సర్‌కు సినారె సాహితీ పురస్కారం ప్రదానం చేశారు. ముఖ్యఅతిథులుగా ప్రముఖ సినీ దర్శకులు, నిర్మాత బి.నర్సింగ్రావు హాజరై కవి అఫ్సర్‌కు రూ.25 వేల నగదు, జ్ఞాపిక, ప్రశంసాపత్రంతో ఘనంగా సత్కరించారు. ప్రధాన కార్యదరద్శి డాక్టర్ జె.చెన్నయ్య, డాక్టర్ ఎ.సిల్మానాయక్, సాహితీ ప్రియులు పాల్గొన్నారు.

ఎక్కడి చెత్త అక్కడే..


జియాగూడ రహదారిలో పేరుకుపోయిన చెత్త

జియాగూడ: జియాగూడలో పలు చోట్ల రోడ్లపైన చెత్తకుప్పల వల్ల ప్రయాణికులు నానా ఇబ్బందులు పడుతున్నారు. పురానాపూల్ నుంచి జియాగూడ రహదారిలో గౌతమ్ మోడల్ స్కూల్, రంగనాథ టెంపుల్, పోలీస్ క్వార్టర్స్, జోర్‌బస్తీ చౌరస్తా, జియాగూడ కమేలా గేట్, సత్యనారాయణనగర్, శాంతినగర్ చౌరస్తా, దరియాబాగ్ తదితర ప్రాంతాల్లో రోడ్లపైన చెత్త కుప్పలు పేరుకుపోతున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని జియాగూడ బీజేపీ సెక్రెటరి ఆరోపించారు. రహదారుల వద్దనే చెత్త కుప్పలు ఉంట్టున్నాయని దీంతో ప్రయాణికులు, పాదచారులు దుర్వాసన వల్ల నానా ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు కోరుతున్నారు.

పొంచి ఉన్న ప్రమాదం

- శిథిలావస్థకు చేరుకున్న మ్యాన్‌హోళ్లు
- ఇబ్బందులు పడుతున్న స్థానికులు
- పట్టించుకోని అధికారులు


ధూల్‌పేట ప్రాంతంలో ప్రమాదకరంగా ఓపెన్ నాలా


శిథిలావస్థకు చేరిన మ్యాన్‌హోల్


పై కప్పు లేని ఓపెన్ నాలా

అబిడ్స్: ధూల్‌పేట్ పరిసర ప్రాంతాల్లో మ్యాన్ హోళ్లు, ఓపెన్ నాలాలు శిథిలావస్థకు చేరాయి. వాటిపై కప్పులు లేకపోవడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వినాయక చవితి సమీపిస్తుండడంతో రాష్ట్రంలోని పలు గ్రామాల నుంచి మండప నిర్వాహకులు వినాయక ప్రతిమలను కొనుగోలు చేసి తరలిస్తున్నారు. పురానాపూల్ చౌరస్తా ప్రాంతంలోని మ్యాన్‌హోళ్ల పై కప్పులు విరిగిపోవడంతో పాటు ఓపెన్ నాలా పై కప్పులు లేకపోవడంతో ప్రమాదాలు చోటు చేసుకునే అవకాశాలున్నాయి.

అధికారులు చర్యలు తీసుకోవాలి..

పురానాపూల్ ప్రాంతంలో పరిస్థితి మరింత తీవ్రంగా ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ చౌరస్తా మీదుగా వందలాది వాహనాల రాకపోకలు సాగుతుంటాయి. దీనికి తోడు వినాయక ప్రతిమల తరలింపు జరుగుతుంది. దీనిని దృష్టిలో ఉంచుకొని అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకొని వెంటనే మ్యాన్‌హోళ్ల పై కప్పులు వేయడంలో పాటు ఓపెన్ నాలాలపై కప్పులు వేసేలా చూడాలని స్థానికులు జీహెచ్‌ఎంసీ కమిషనర్‌కు విజ్ఞప్తి చేశారు. ప్రతి సంవత్సరం ధూల్‌పేట్ పరిసర ప్రాంతాల్లో చిన్నా, పెద్ద వినాయక ప్రతిమలతో కలిపి దాదాపు లక్ష వినాయక ప్రతిమలను తయారు చేసి ఇతర ప్రాంతాలకు తరలిస్తారు.

వెంటనే నాలా పై కప్పలను ఏర్పాటు చేయాలి..



వినాయక చవితిని పురస్కరించుకొని ధూల్‌పేట ప్రాంతంలో తయారవుతున్న వినాయక ప్రతిమల తరలింపు ప్రారంభం అవుతుంది. దీనిని దృష్టిలో ఉంచుకొని మ్యాన్‌హోళ్ల పై కప్పులు ఏర్పాటు చేయడంతో పాటు ఓపెన్ నాలాలపై కప్పులను నిర్మించాలి. భారీ వాహనాల రాకపోకల సందర్భంగా ప్రమాదాలు జరిగేందుకు అవకాశం ఉంది. ఈ విషయంలో ప్రత్యేక దృష్టి కేంద్రీకరించాలి. అదే విధంగా ధూల్‌పేట పరిసర ప్రాంతాల్లో రహదారులకు మరమ్మతులు చేపట్టేందుకు అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలి.

– సుధీర్ కుమార్ తివారి

ఆకట్టుకున్న నృత్య ప్రదర్శన



గన్‌ఫౌండ్రీ: కూచిపూడి నాట్య సంప్రదాయంలో అత్యంత శోభాయమానమైన భామ కలాపాన్ని యువ కళాకారిణి అక్షర దేవళ్ల అద్భుతంగా నర్తించారు. 2.30 గంటల పాటు నిర్విరామంగా కొనసాగిన ఈ నృత్య రూపకం ఐదు అవార్డులను సొంతం చేసుకుంది. శనివారం రవీంద్రభారతిలో భావన కూచిపూడి డ్యాన్స్ అకాడమి ఆధ్వర్యంలో నాట్య గురువు ఘంటసాల పవన్‌కుమార్ శిష్యురాలు అక్షర దేవళ్ల కూచిపూడి రంగప్రవేశం కనుల పండువగా జరిగింది. ఈ కార్యక్రమంలో వేదాంతం రామలింగ శాస్త్రి, భాగవతుల సేతురామ్, శేషుబాబు,సాంబ శివరావు, భావన పాల్గొన్నారు.

కాకతీయ కళావైభవం వాల్‌పోస్టర్ ఆవిష్కరణ


వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న మధుసూదనాచారి

గన్‌ఫౌండ్రీ: తెలంగాణ జానపద నృత్యానికి విశ్వకళా విరాట్ డాక్టర్ శాంతికృష్ణ ఆచార్య ప్రపంచస్థాయి గుర్తింపు తెచ్చారని శాసన మండలి ప్రతిపక్ష నేత ఎస్.మధుసూదనాచారి అన్నారు. తెలంగాణ రాష్ట్ర భాషా, సాంస్కృతిక శాఖ సౌజన్యంతో శ్రీ శాంతికృష్ణ సేవా సమితి ఆధ్వర్యంలో నిర్వహించనున్న కాకతీయ కళావైభవం వాల్‌పోస్టర్‌ను శనివారం రవీంద్ర భారతిలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ప్రపంచ వ్యాప్తంగా కళా రంగంలో విశిష్టసేవలందించిన తెలుగువారిని గుర్తించి పురస్కారాలను ఇవ్వడం అభినందనీయమన్నారు. సేవా సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు శాంతికృష్ణ మాట్లాడుతూ..కాళోజి క్షేత్రంలో ఆగస్టు 31న నిర్వహించే కార్యక్రమంలో 108 మంది తెలుగు కళాకారులకు పురస్కారాలను ఇవ్వనున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో భాషా సాంస్కృతిక శాఖ డైరెక్టర్ మామిడి హరికృష్ణ, సాహిత్య అకాడమి కార్యదర్శి బాలాచారి, తెలంగాణ రాష్ట్ర ఉద్యోగుల గౌరవ అధ్యక్షులు పద్మాచారి తదితరులు పాల్గొన్నారు.

మిధానిలో హిందీ టైపింగ్‌పై అంతర్–సంస్థ పోటీలు


మాట్లాడుతున్న హరికృష్ణ

సంతోష్‌నగర్: హైదరాబాద్–సికింద్రాబాద్ నగర్ రాజ్‌భాషా అమలు కమిటీ (నరకాస్ యు)ఆధ్వర్యంలో భారత ప్రభుత్వ రక్షణ మంత్రిత్వ శాఖకు చెందిన మిశ్ర ధాతు నిగమ్ లిమిటెడ్ (మిధాని) ప్రాంగణంలో శనివారం కంప్యూటర్ ద్వారా హిందీ వర్డ్ ప్రాసెసింగ్ (హిందీ టైపింగ్)పై అంతర్–సంస్థ పోటీలను నిర్వహించారు. ఈ పోటీల్లో వివిధ సంస్థల నుంచి ఉద్యోగులు, హిందీ విభాగం, ఇతర విభాగాల కేటగిరీల్లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమ ప్రారంభంలో మిధాని మానవ వనరుల విభాగాధిపతి హరికృష్ణవి, మానవ వనరుల అదనపు జనరల్ మేనేజర్‌లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నరకాస్ (యు) సభ్య కార్యదర్శి, ఈసీఐఎల్ మేనేజర్ డాక్టర్ రాజ్‌నారాయణ్ అవస్థి మాట్లాడుతూ.. ఈ పోటీలు హిందీ భాషను ప్రోత్సాహించడంలో ప్రధాన పాత్ర పోషిస్తాయన్నారు. హెచ్‌ఆర్ అదనపు జనరల్ మేనేజర్ ఎం.పి.రమేశ్, హిందీ విభాగం అండ్ కార్పొరేట్ కమ్యూనికేషన్ మేనేజర్ డాక్టర్ బి.బాలాజీ, కంటైనర్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ సంస్థ అదనపు అధికారి ఉషారాణి, హిందీ ఎగ్జిక్యూటివ్ డి.వి.రత్న కుమారి తదితరులు పాల్గొన్నారు.

వర్ష బీభత్సం

- ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షం
- జలమయమైన రోడ్లు, లోతట్టు ప్రాంతాలు
- ఇబ్బందులు పడిన వాహనదారులు
- సహాయక చర్యల్లో అధికారులు


టూంబ్స్ రోడ్డుపై వరద నీరు


టోలిచౌకీ వద్ద డ్రైనేజీని క్లీన్ చేస్తున్న హైడ్రా సిబ్బంది


గోల్కొండలో రోడ్లపై ప్రవహిస్తున్న మురుగు నీరు

గోల్కొండ: వరుసగా కురుస్తున్న భారీ వర్షం ప్రజలను బేజారెత్తిస్తుంది. ప్రధాన రహదారులతో పాటు బస్తీలు, కాలనీల ప్రధాన రోడుకాలువలుగా మారాయి. మెహిదీపట్నం, గుడిమల్కాపూర్ ప్రధాన రహదారులు కాలువలను తలపిస్తున్నాయి. రేతిబౌలి చౌరస్తా, టోలిచౌకీ చౌరస్తాల వద్ద వర్షపు నీటిలో కొట్టుకు వచ్చిన వరద, బురద మేట వేశాయి. టోలిచౌకీ నదీమ్ కాలనీ, గోల్కొండ రేతిగల్లీ, కార్వాన్ మెయిన్ రోడ్డు, గుడిమల్కాపూర్ మార్కెట్ రోడ్ తదితర ప్రాంతాల్లోని రోడ్లపై కాలువ నీరు ప్రవహిస్తోంది. టోలిచౌకీ చౌరస్తా వరద నీటిలో కొట్టుకు వచ్చిన వ్యర్థాలతో కంపుకొడుతోంది. భారీగా వరద నీరు ఆగిపోవడంతో టోలిచౌకీ చౌరస్తా వద్ద హైడ్రా, బల్దియా అధికారులు రంగంలోకి దిగారు. డ్రైనేజీల్లో పేరుకుపోయిన వ్యర్థాలను తొలగించి వరద నీరు ఆగకుండా చర్యలు తీసుకున్నారు. మరోవైపు టోలిచౌకీ చౌరస్తా వద్ద గల రెస్టారెంట్లు, షాపుల్లో వరద నీరు చొచ్చుకు వచ్చింది.

నేడు ఫిలక్‌మాత ఆలయంలో బోనాలు

డబీర్‌పురా: ఫర్హత్‌నగర్‌లోని ఫిలక్‌మాత ఆలయంలో ఆదివారం బోనాల ఉత్సవాలను నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ ప్రతినిధులు తెలిపారు. బోనాల ఉత్సవాలను పురస్కరించుకొని ఇప్పటికే ఆలయం వద్ద అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయన్నారు. భక్తులకు ఎక్కడ ఎలాంటి అసౌకర్యాలు కలుగకుండా అన్ని ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ఈ నెల 28న అమ్మవారి ఘటం ఊరేగింపు కార్యక్రమం ఉంటుందన్నారు.

క్లాస్–4 సంఘం భవనానికి కరెంట్ కట్

నాంపల్లి: తెలంగాణ నాలుగో తరగతి ఉద్యోగుల కేంద్ర సంఘం రాష్ట్ర కార్యాలయానికి అద్దె బకాయిలు చెల్లించకపోవడంతో హౌసింగ్ బోర్డు అధికారులు విద్యుత్ కనెక్షన్‌ను కట్ చేశారు. అద్దెతో పాటుగా నీళ్ల చార్జీలు, కరెంటు బకాయిలు కలిపి మొత్తం రెండు లక్షల ఆరు వేల రూపాయలు ఉన్నట్లు హౌసింగ్ బోర్డు అధికారులు తెలిపారు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్రంలో తెలంగాణ నాలుగో తరగతి ఉద్యోగుల సంఘానికి చదరపు అడుగుకు ఒక రూపాయి చొప్పున మూడు వేల చదరపు అడుగులను కేటాయించారు. అయితే నాలుగో తరగతి ఉద్యోగుల కేంద్ర సంఘం–2024 జనవరి నుంచి హౌసింగ్ బోర్డుకు అద్దె చెల్లించలేదు. ఇటీవల ఉద్యోగ సంఘాలకు కేటాయించిన భవనాల అద్దె ధరలను పెంచారు. ఒక చదరపు అడుగు స్థలం రూ.5 లకు పెంచారు. ఈ నేపథ్యంలో హౌసింగ్ బోర్డు ఎండీ మొండి బకాయిలు ఆస్తులపై దృష్టిసారించారు. ఏళ్లకు ఏళ్ల అద్దెలు చెల్లించని వాటిని తమ ఆధీనంలోకి తీసుకునే ప్రయత్నం చేస్తున్నారు. ఇందులో భాగంగానే తెలంగాణ నాలుగో తరగతి ఉద్యోగుల కేంద్ర సంఘానికి కరెంట్‌ను కట్ చేశారు.

‘బోనాల పేరిట వసూళ్లు’


జీవన్‌సింగ్

గోల్కొండ: గోల్కొండ బోనాల పేరుతో ఆలయ ట్రస్ట్ కమిటీ సభ్యులు భారీ అక్రమ వసూళ్లకు తెరలేపారని బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు టి.జీవన్‌సింగ్ ఆరోపించారు. కోట బోనాల నిర్వహణలో కాంగ్రెస్ నాయకులు అవినీతి ముద్రను స్పష్టంగా వేశారన్నారు. ఆలయ ట్రస్ట్ కమిటీ చైర్మన్‌తో పాటు ట్రస్ట్ కమిటీ సభ్యులు విచ్చలవిడిగా అమ్మవారి పేరుతో అక్రమ వసూళ్లు చేశారని ఆయన ఆరోపించారు. గతంలో తెలంగాణ రాష్ట్ర అవతరణ అనంతరం వచ్చిన బీఆర్‌ఎస్ ప్రభుత్వం బోనాలను భారీ ఎత్తున నిర్వహించిందన్నారు. అయితే కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలో మాత్రం దేవాదాయ శాఖ అధికారులతో పాటు ఆలయ ట్రస్ట్ కమిటీ సభ్యులు భక్తుల నుంచి వివిధ ప్రాంతాల్లో భారీగా డబ్బులు వసూలు చేశారని ఆయన ఆరోపించారు. అమ్మవారిపై భక్తి ఉన్న ఆలయ ట్రస్ట్ కమిటీ సభ్యులు నిజాయితీగా వెంటనే తాము వసూలు చేసిన విరాళాలను వెల్లడించి వాటిని దేవాదాయ శాఖవారికి అందజేయాలని ఆయన డిమాండ్ చేశారు.

ప్రత్యేక పూజలు



గోల్కొండ: గోల్కొండ కోటలో జగదాంబిక మహంకాళి అమ్మవారికి శనివారం ప్రత్యేక పూజలునిర్వహించారు. అమ్మవారి దర్శనానికి వివిధ ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద ఎత్తున కోటకు తరలివచ్చారు. సంప్రదాయ దుస్తుల్లో వచ్చిన మహిళలు నగీనాబాగ్‌లోని నాగదేవత పుట్టకు పూజలు నిర్వహించారు. మార్గమధ్యంలో ఉన్న భక్తరామదాసు చరసాలలో సైతం పూజలు నిర్వహించారు.

ఎన్‌హెచ్‌ఎం కాంట్రాక్ట్ ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల జీతాలు పెంచాలి


ఎన్‌హెచ్‌ఎం కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న యూనియన్ నాయకులు

సుల్తాన్‌బజార్: నేషనల్ హెల్త్ మిషన్ స్కీమ్‌లో పని చేస్తున్న కాంట్రాక్ట్ ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల జీతాలు పెంచాలని ఏఐటీయూసీ రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి ఎం.నర్సింహా డిమాండ్ చేశారు. శనివారం ఎన్‌హెచ్‌ఎం కాంట్రాక్ట్ అండ్ ఔట్ సోర్సింగ్, ఏఐటీయూసీ ఆధ్వర్యంలో కోఠిలోని ఎన్‌హెచ్‌ఎం డైరెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..రాష్ట్రంలో దాదాపు 1000 మంది నాలుగో తరగతి సిబ్బంది ఈ స్కీమ్ కింద పనిచేస్తున్నారని వీరికి కనీస వేతన చట్టం ప్రకారం జీతాలు అమలు చేయాలని కోరారు. ఆర్‌బీఎస్‌కే డ్రైవర్లకు వెంటనే రావాల్సిన అద్దె బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేశారు. తదితర డిమాండ్లపై ఎన్‌హెచ్‌ఎం చీఫ్ ప్రోగ్రామింగ్ ఆఫీసర్ పద్మజకు వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రామాంజనేయులు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామరాజేష్ ఖన్నా, బాలయ్య, రమేష్, జగన్, బాలసుబ్రమాణ్యం, జ్యోతి, మహేష్, గణేష్, పద్మ, బాలకృష్ణ పాల్గొన్నారు.

సెట్విన్ ఎండీకి విశ్వగురు వర్డల్ రికార్డ్స్ అవార్డు


వేణుగోపాల్ రావుకు అవార్డును అందజేస్తున్న హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ లక్ష్మీనారాయణ

యాకుత్‌పురా: సెట్విన్ శిక్షణ సంస్థ ఎండీ వేణుగోపాల్ రావుకు విశ్వగురు వర్డల్ రికార్డ్స్ అవార్డు లభించింది. విశ్వగురు వర్డల్ రికార్డ్స్ సంస్థ ఆధ్వర్యంలో శనివారం నగరంలో నిర్వహించిన కార్యక్రమంలో హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ లక్ష్మీనారాయణ ముఖ్య అతిథిగా హాజరై ఆయనకు అవార్డును ప్రదానం చేశారు. ఈ సందర్భంగా వేణుగోపాల్‌రావు మాట్లాడుతూ..రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న సహకారం సంస్థలో అనేక ఉపాధి అవకాశాల కోర్సులను ప్రవేశపెట్టి శిక్షణ అందిస్తున్నామన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి నైపుణ్యాభివృద్ధిపై చూపుతున్న ప్రత్యేక ఆదరణ, యువజన సర్వీసులు శాఖ మంత్రి వాకిటి శ్రీహరి, సెట్విన్ చైర్మన్ గిరిధర్ రెడ్డి, యువజన సర్వీసుల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేష్‌రంజన్ సంపూర్ణ సహకారంతో ఈ ఘనత సాధిచానన్నారు. ఈ కార్యక్రమంలో విశ్వగురు వర్డల్ రికార్డ్స్ ఎండీ సత్యవోలు రాంబాబు, ఇతర ప్రముఖులు పాల్గొన్నారు.

‘ఎస్సీ వర్గీకరణ జీఓతో మాలలకు నష్టం’


మంత్రి వివేక్ వెంకటస్వామికి వినతిపత్రం అందజేస్తున్న బాలకృష్ణ

సుల్తాన్‌బజార్: ఎస్సీ వర్గీకరణ జీఓ నెంబర్ 99 వల్ల తెలంగాణలో మాల విద్యార్థులకు, ఉద్యోగులకు రోస్టర్ పాయింట్ విధానం వల్ల తీరని అన్యాయం జరుగుతుందని దీనిపై న్యాయం చేయాలని తెలంగాణ మాల సంఘాల జేఏసీ చైర్మన్ డాక్టర్ మందాల భాస్కర్, గ్రేటర్ హైదరాబాద్ మాల సంఘాల జేఏసీ చైర్మన్ బేరా బాలకిషన్ మంత్రి వివేక్ వెంకటస్వామిని కోరారు. శనివారం మంత్రిని కలిసి వినతి పత్రం సమర్పించచారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..ఎస్సీ వర్గీకరణ వల్ల తెలంగాణలోని మాల విద్యార్థులు, ఉద్యోగులకు ఎంతో నష్టం జరుగుతుందన్నారు. ఈ విషయమై సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్లి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని మంత్రి వివేక్ హామీ ఇచ్చారని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాల సంఘాల జేఏసీ చీఫ్ కోఆర్డినేటర్ తాళ్లపల్లి రవి, వర్కింగ్ చైర్మన్ సిద్దిపేట భీమసేన, ఓయూ విద్యార్థి జేఏసీ అధ్యక్షుడు రాహుల్‌రావు, డాక్టర్ బీవీ స్వామి పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తత అవసరం


నిలోఫర్‌ను సందర్శించిన సంగీత సత్యనారాయణ తదితరులు

నాంపల్లి: వర్షాకాలంలో వచ్చే సీజనల్ వ్యాధులపై వైద్యాధికారులు అవసరమైన జాగ్రత్తలు తీసుకోవాలని వైద్య, కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ ఎస్.సంగీత సత్యనారాయణ (ఐఏఎస్) ఆదేశించారు. శనివారం రెడ్‌హిల్స్‌లోని నిలోఫర్ ఆసుపత్రిని సందర్శించిన ఆమె మాట్లాడారు. ఆసుపత్రికి అవసరమైన పరికరాలను పెంచడానికి సంసిద్ధతను వ్యక్తం చేశారు. అనంతరం ఆమె పీడియాట్రిక్ ఇంటెన్సివ్ కేర్ యూనిట్ (పీఐసీయూ), సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్ (ఇ–ఎస్‌ఎన్‌సీయూ), లెవల్–3 వార్డును సందర్శించారు. అలాగే సీజనల్ జ్వరం కేసులపై ప్రొఫెసర్ సుచిత్రను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో నిలోఫర్ మెడికల్ సూపరింటెండెంట్ ప్రొఫెసర్ డాక్టర్ జి.విజయ్‌కుమార్, సీఎస్‌ఆర్‌ఎంఓ డాక్టర్ సీహెచ్.నాగజ్యోతి తదితరులు పాల్గొన్నారు.


బ్రోచర్ ఆవిష్కరణ


సిటీ కాలేజీలో ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్ బ్రోచర్ ఆవిష్కరిస్తున్న దృశ్యం

చార్మినార్: ప్రభుత్వ సిటీ కాలేజ్ ప్రాంగణంలో జరిగే మూడు రోజుల ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్ బ్రోచర్‌ను శనివారం కాలేజ్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ పి.బాల భాస్కర్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమం ఆగస్ట్ 5 నుంచి 7వ తేదీ వరకు జరగనుంది. ఈ సందర్భంగా ప్రొఫెసర్ భాస్కర్ మాట్లాడుతూ..జాతీయ విద్యా విధానం 2020లో భాగంగా అప్రెంటిస్‌షిప్‌తో కూడిన డిగ్రీ కోర్సులను విజయవంతంగా అమలు చేయడంలో అధ్యాపకుల పాత్ర కీలకమని పేర్కొన్నారు. ఈ శిక్షణలో క్రిస్ప్, బోట్ (దక్షిణ ప్రాంతం), రిటైల్, బీఎఫ్‌ఎస్‌ఐ, లైఫ్ సైన్సెస్ వంటి సెక్టార్ స్కిల్ కౌన్సిల్స్ నుంచి నిపుణులు అధ్యాపకులకు అవగాహన కల్పిస్తారు. విప్లవ్ దత్ శుక్లా, నైన వినోదిని, జ్యోతి, శిరిష, రవీంద్రబాబు, నీరజ, మల్లికార్జున రావు పాల్గొన్నారు.

నేడు చార్మినార్ నుంచి కావడి యాత్ర

చార్మినార్: భాగ్యనగర్ కావడి సేవా సంఘం ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం చార్మినార్‌లోని మహదేవ్ మందిరం నుంచి కావడి పాదయాత్ర నిర్వహించనున్నట్లు సంఘం పబ్లిసిటీ కన్వీనర్ పంకజ్ వర్మ తెలిపారు. 28వ గంగా జల్ కావడి పాదయాత్ర చార్మినార్ నుంచి బయలుదేరి నార్సింగ్ వరకు కొనసాగుతుందన్నారు. ఈ కార్యక్రమానికి హాజరు కావాలని కోరుతూ మీరాలంమండి మహంకాళేశ్వర ఆలయ కమిటీ చైర్మన్ గాజుల అంజయ్యకు శనివారం ఆహ్వాన పత్రిక అందజేశారు. కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకుడు అనిల్ బజాజ్ పాల్గొన్నారు.


గాజుల అంజయ్యకు ఆహ్వానపత్రం అందజేస్తున్న పంకజ్ వర్మ, అనిల్ బజాజ్

బాలికలను క్రీడల్లోనూ ప్రోత్సహించాలి


కిక్‌బాక్సింగ్ పోటీలను ప్రారంభిస్తున్న జితేందర్‌రెడ్డి

గన్‌ఫౌండ్రీ: క్రీడల్లో బాలికలను ప్రోత్సహించాలని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు జితేందర్ రెడ్డి అన్నారు. శనివారం ఎల్బీస్టేడియంలో తెలంగాణ కిక్ బాక్సింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అస్మిత కిక్ బాక్సింగ్ లీగ్‌ను ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..కిక్ బాక్సింగ్ కేవలం పతకాల కోసమే కాదని ఆత్మరక్షణ, ఆత్మస్థైర్యానికి ఉపయోగపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో స్పోర్ట్స్ అథారిటీ ఎండీ సోని బాలదేవి, అసోసియేషన్ అధ్యక్షులు రామాంజనేయులు, కార్యదర్శి మహిపాల్, కోశాధికారి శ్రీనివాస్ పాల్గొన్నారు.

అధికారులు అప్రమత్తంగా ఉండాలి


నిజాం కాలనీలో పర్యటిస్తున్న ఎమ్మెల్యే కౌసర్

గోల్కొండ: వర్షాకాలంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఎమ్మెల్యే కౌసర్ మోహియుద్దీన్ అన్నారు. శనివారం ఆయన కార్వాన్ నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో పర్యటించారు. డ్రైనేజీ నీరు తమ ఇళ్లల్లోకి చొచ్చుకు వస్తుందని పలువురు ఆయనకు ఫిర్యాదు చేశారు. అయితే లోతట్టు ప్రాంతాల్లో భారీగా వరద నీరు రావడం వల్ల ఇళ్లల్లోకి వరద నీరు వచ్చిందని అయితే అధికారులు వెంట వెంటనే నివారణ చర్యలు తీసుకున్నారని ఆయన వివరించారు. కార్వాన్ నియోజకవర్గానికి అన్ని డివిజన్లలో మాన్సూన్ రెస్క్యూటీమ్‌లను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. అదే విధంగా పారిశుద్ధ్యంపై కూడా స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నామన్నారు. నానల్‌నగర్ చౌరస్తా, టోలిచౌకీ చౌరస్తా, ఫ్లోర్ మిల్ తదితర ప్రాంతాల్లోని డ్రైనేజీ లైన్‌లకు యుద్ధప్రాతిపదికన పూడికతీత పనులు చేయించామన్నారు. నానల్‌నగర్ కార్పొరేటర్ మహ్మద్ నసీరుద్దీన్, నాయకులు హారూన్‌ఫరాన్ తదితరులున్నారు.